క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో స.హ.చట్టం కమిషనర్



కమిషనర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేష్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర సమాచారహక్కు చట్టం కమిషనర్ కట్ట జనార్దన్‌రావు దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా శుక్రవారం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేష్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వాదం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, జెడ్పీసీ ఈఓ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈఓలు

బంగారుపాళెం: పాఠశాలల్లో పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని ఎంఈఓలు నాగేశ్వరరావు, రమేష్ బాబు అన్నారు. మండలంలోని కోలావారిఊరు ప్రాథమిక పాఠశాలను శుక్రవారం వారు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పిల్లలకు పెట్టే భోజనంలో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం వంటలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే దోమల కట్టడి సాధ్యం



వీరభద్రకాలనీలో పర్యటిస్తున్న డీఎంహెచ్ఓ ప్రభావతీ దేవి

చిత్తూరు రూరల్: పరిశుభ్రతతోనే దోమల కట్టడి సాధ్యమని డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు నగరం వీరభద్రకాలనీలోని శుక్రవారం ఆమె పర్యటించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. కాలనీలోని పలు ఇళ్లను తనిఖీ చేసి కాలనీవాసులకు పలు సూచనలు చేశారు. ఇంటి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పీరు సాహెబ్, లలిత్, మనోహర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లె రోడ్డులో ఈశ్వరుని గుడిలోని గౌరీశంకర్ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు మామిడి రైతులకు కోతల అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖ అధికారి లక్ష్మీప్రసూన తెలిపారు. శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారులు రైతులకు తగు సూచనలు, సలహాలిస్తారని వివరించారు.

వజ్రాలపురం గంగమ్మకు నగల బహూకరణ



నగలను బహూకరిస్తున్న దాతలు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మకు శుక్రవారం దాతలు రూ.1.20 లక్షల విలువైన బంగారు నగలను అందజేశారు. ఐరాల మండలం వడ్రాంపల్లె పంచాయతీ మిట్టఇండ్లుకు చెందిన దాతలు రాళ్లపల్లె కల్పన, హరీష్‌నాయుడు, మదన్‌మోహన్ బెంగళూరులో వ్యాపారం చేస్తున్నారు. వీరు అమ్మవారికి లక్షా 20 వేల రూపాయల విలువ చేసే బంగారు కనుబొమ్మలు, ముక్కుపుడక, నుదుటి బొట్టును బహూకరించారు. వాటిని అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దాతలను ఆలయ ధర్మకర్త కృష్ణప్ప, కమిటీ సభ్యులు శివలింగయ్య, నాగరాజ, రామూర్తినాయుడు, సుబ్బానాయుడు, శంకరయ్య, ఆలయ మేనేజరు మొగిలప్ప సన్మానించారు.



అమ్మవారికి బహూకరించిన నగలు

జోరుగా వరి నాట్లు

- 113 హెక్టార్లలో వరిసాగు లక్ష్యం
- సాగుపై మక్కువ చూపుతున్న రైతులు



మారేడుపల్లె సమీపంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగులో రైతులు బిజీబిజీగా ఉన్నారు. భూమికి పచ్చని బొట్టుపెట్టినట్లుగా భూములన్నీ సస్యశ్యామలంగా మారాయి. మండలంలో 113 హెక్టార్లలో వరిసాగు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీంతో రైతులు దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు పొలాల్లోకి తోలడం, నార్లు పోయడం వంటి పనుల్లో రైతులు తలమునకలై ఉన్నారు. అదునుకు నాట్లు వేయడానికి రైతన్నలు శ్రమిస్తున్నారు. ఎకరా పొలంలో వరిసాగు చేయడానికి రైతులు సుమారు రూ.35 వేలు పైగా పెట్టుబడి పెట్టుతున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా రైతుల భరోసా పేరుతో ఖాతాల్లోకి కొంత నగదు జమ చేయడంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనులు చేపడుతున్నారు. మండలంలో 113 హెక్టార్లలో వరిసాగు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు రైతులు 56 హెక్టార్లలో వరినాట్లు వేశారు. ఇంకా చాలా మంది రైతులు వరినాట్లు వేయడానికి పొలాలను సిద్ధం చేస్తున్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు

వరిసాగు చేయడానికి ముందు రైతులు దుక్కి బాగా దున్నాలి. ఆ తరువాత దుక్కిలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వేసి కలియదున్ని సాగుకు సిద్ధం చేయాలి. రెండవ సారి, మూడవ సారి కూడా వరిపంట సాగు చేయాలనుకుంటే, ఆఖరి దుక్కిలో జింకు సల్ఫేటు ఎకరాకు 20 కిలోలు వేసి నాట్లు వేయాలి. వరినాట్లు వేసిన 20 రోజుల తర్వాత మొదటి విడతగా ఎకరాకు యూరియా 25 కిలోలు, పొటాష్ 10 కిలోలు వేయాలి. తర్వాత రెండవ విడతగా 40 రోజులకోసారి యూరియా 25 కిలోలు, పొటాష్ 10 కిలోలు వేయాలి.

కాలి బాటలు వదలాలి

వరినాట్లు వేసేటప్పుడు పొలంలో ప్రతి రెండు అడుగులకు ఒక కాలిబాట వదిలిపెట్టాలి. దీని వల్ల దోమపోటు నివారించవచ్చు. వరినాట్లు వేసే ముందు నారు కొనలు కత్తిరించి నాటాలి. వరినారు కొనల్లో కాండం తొలిచే పురుగులు గుడ్లు నిల్వ ఉంచుతాయి. నారు కొనలు కత్తిరించడం వల్ల కాండం తొలిచే పురుగులు నియంత్రించవచ్చు. నారును కార్బన్‌డైజ్ ద్రావణంలో వేర్లు బాగా తడిసే విధంగా అద్ది నాటాలి.

నాణ్యమైన విత్తనాలు అవసరం



నారు పోసే ముందు నాణ్యమైన విత్తనాలు తీసుకోవాలి. రైతులు మంచి దిగుబడి వచ్చే వరి విత్తనాలను నారు పోసి నాటాలి. వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చును. రైతులు వరినారు పోసి నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలో సాధారణ సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం. రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి.

- జి.ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె

ఈ సీజన్‌లో మంచి దిగుబడి



ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది. వ్యవసాయ అధికారుల సలహాలతో సాగు చేస్తున్నాం. పంట కోత సమయంలో వర్షాలు పడే అవకాశం ఉంటుంది. దీనికి తగినట్లు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ పంటను నూర్పిడి చేసుకుంటాం. ప్రభుత్వం అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులోనే ఉంచింది. చాలా సంతోషంగా ఉంది.

- మునస్వామి నాయుడు, రైతు, దిగువమోదలపల్లె

ఎకరా సాగు చేస్తున్నా



ఎకరా పొలంలో నర్మద రకం విత్తనాలు నారు పోశాను. నారు ఏపుగా వచ్చింది. విత్తనాలు నాణ్యంగానే ఉన్నాయి. ఈ సీజన్‌లో ఎకరా సాగు చేయడానికి సుమారు రూ.35 వేలు ఖర్చు అవుతోంది. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాను. మా ఊర్లోని రైతు భరోసా కేంద్రంలో ఈ పంటకు కావలసిన ఎరువులు, పరుగు మందులు వంటివి అందుబాటులో ఉంచారు.

- పి.కన్నన్, రైతు, ముత్తరపల్లెసత్రం

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక 46వ డివిజన్ ఓబనపల్లె తాటితోపులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు వినాయకస్వామి గుడిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూజలు చేసిన అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

నేడు ప్రసూతి వైద్య సిబ్బందితో సమావేశం

చిత్తూరు రూరల్: ఇటీవల జరుగుతున్న ఘటనలపై చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి, చిన్న పిల్లల విభాగాల్లో పనిచేసే డాక్టర్లు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు డీసీహెచ్ఎస్ బీఎస్‌కే నాయక్ తెలిపారు. ప్రసూతి విభాగంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి విధిగా ఆ విభాగంలోని డాక్టర్లు, సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్సీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై కలెక్టర్‌తో ఆయన చర్చించారు. జిల్లాలో అమలవుతున్న విద్యాసంక్షేమ పథకాలు పలు కార్యక్రమాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌చంద్రారెడ్డి, కణ్ణన్, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి వినతులు



ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డితో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్స్ యూనియన్ నాయకులు పలువురు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌కు రావడంతో పీఆర్‌టీయూ, ఏపీసీఆర్‌పీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్సీని కలిశారు. ఎంఆర్‌సీలలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్‌పీల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ నిబంధనలు రూపొందించి డీవైఈవో, జేఎల్, డైట్ లెక్చరర్ల ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. పని సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌చంద్రారెడ్డి, కణ్ణన్, సీఆర్‌పీల అసోసియేషన్ నాయకులు నందకుమార్, లత, బిందు, గీత, యమున పాల్గొన్నారు.

ఈ అన్నం పిల్లలు ఎలా తింటారు?

- మీ ఇంట్లో అయితే ఇలాగే చేస్తారా?
- మధ్యాహ్న భోజన నాణ్యతపై ఎంపీడీవో ఆగ్రహం



కూరలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ''ఈ అన్నం పిల్లలు ఎలా తింటారు? ఈ కూరలో పప్పు వేశారా లేదా? మీ ఇంట్లో అయితే ఇలాగే చేస్తారా? అసలు ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారు. ముందు ఉపాధ్యాయులు తిని ఆ తరువాత పిల్లలకు వడ్డించాలి.'' అంటూ ఎంపీడీవో గౌరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు నాణ్యమైన సరుకులు అందిస్తుంటే, నిర్వాహకులు మాత్రం నాణ్యమైన భోజనం అందించడం లేదని మండిపడ్డారు. ఆమె శుక్రవారం మండలంలోని పి.కొత్తకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించారు. అక్కడ అన్నం ముద్దగా ఉండడంతో నిర్వాహకులను ప్రశ్నించారు. ప్రభు త్వం నాణ్యమైన సరుకులను మోతాదుకు మించి అందజేస్తుంటే, 200 మంది పిల్లలకు 3 కిలోల కందిపప్పును మాత్రమే వినియోగించడమేంటి అని నిలదీశారు. అన్నం ముద్దగా మారిపోవడంతో పిల్ల లు సరిగా భోజనం చేయడం లేదని గుర్తించారు. అంతేగాక స్టాక్ తక్కువ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు తిన్న తరు వాత, పిల్లలకు భోజనం అందించాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం ఎన్నో కోట్లు వెచ్చించి, రుచికరమైన భోజనం పెట్టాలని జగనన్న గోరుముద్ద కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పేద పిల్లలు వారి ఇంట్లో సమయానికి సరైన భోజనం లేనందున, ప్రభుత్వ బడుల్లో వారికి పోషకాహారాన్ని అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మజారాణి, ఈఓ పీఆర్‌డీ మంజునాథ్, పంచాయతీ కార్యదర్శి జరీనా, ప్రధానోపాధ్యాయులు గోపి పాల్గొన్నారు.

లగేజీ వ్యాన్ ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్ద శుక్రవారం ఓ ఆటో డ్రైవర్ లగేజీ వ్యాన్‌ను ఢీకొని ఘటన స్థలంలోనే మృతి చెందాడు. వివరాలు.. నగరంలోని జాన్సన్‌గార్డెనుకు చెందిన యాసిన్(46) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం ఫారెస్ట్ నుంచి కలెక్టర్ బంగ్లా మీదుగా ఆటోలో వెళ్తూ.. ఆ ప్రాంతంలో పార్కింగ్ చేసి ఉన్న టాటా ఏస్ లగేజీ వ్యాన్‌ను ఢీకొని సంఘటన స్థలంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు ట్రాఫిక్ ఎస్ఐ జయప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బృందం పర్యటన



ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పూతలపట్టు: మండలంలో కేంద్ర బృందం పలు ప్రాంతాల్లో పర్యటించింది. స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా శుక్రవారం కేంద్ర బృందం పి.కొత్తకోట పంచాయతీలోని ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించింది. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డంపింగ్ యార్డు, డ్రైనేజీ కాలువలు, మరుగుదొడ్లను పరిశీలించారు. సంబంధిత నివేదికను మొబైల్ ద్వారా కేంద్రానికి పంపించారు. కేంద్ర బృందం సభ్యులు రామమోహన్ నాగేంద్ర మాట్లాడుతూ పంచాయతీలో చెత్తా చెదారం లేకుండా, పరిశుభ్రంగా ఉంటే ఆ పంచాయతీని మోడల్ పంచాయతీగా కేంద్రం ప్రకటిస్తుందని తెలిపారు. సర్పంచ్ పద్మజారాణి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ మంజునాథ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



వినతులను స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని నగర కమిషనర్ జె అరుణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, శుక్రవారం నగర పాలక కార్యాలయంలో ×ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో విధులు నిర్వహించే అధికారుల నుంచి కార్మికుల వరకు అందరి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగులో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించామని గుర్తుచేశారు. ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. నగరపాలక సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపాలకష్ణ వర్మ ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. కార్పొరేషన్ స్థాయిలో ఉద్యోగుల సంఖ్య పెంచాలని విన్నవించారు. పలువురు ఉద్యోగులు, వార్డు కార్యదర్శులు, సిబ్బంది తమ సమస్యలపై వినతులు అందించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సుమంగళి వ్రతంలో పాల్గొన్న మహిళలు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడుగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం చేశారు. గోపూజ, శ్రీకృష్ణుడికి పాలాభిషేకం జరిపారు. మధ్యాహ్నం నుంచి హరికథా గానం జరిగింది. సాయంత్రం నిర్వహించిన సుమంగళి వ్రతం, కుంకుమార్చన, జ్యోతిపూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. రాత్రి 9 గంటలకు ఆధ్వర్యంలో ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 10 గంటలకు పట్టణానికి చెందిన శ్రీబాలాజీ వీధి నాట్య కళా బృందం ప్రదర్శించిన శశిరేఖ పరిణయం నాటకం అలరించింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, సభ్యులు ముకుంద ప్రకాష్, సెల్వరాజ్ పిళ్ళై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ నిర్వాహకులు సాల్వాకం ఏలుమలైమొదలి, పళణి మొదలి, గోపిమొదలి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరవింద్

ఐరాల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అరవింద్ సూచించారు. మండలంలోని నవటపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్ట ర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 90 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వర్షాల కారణంగా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జి.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని జి.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులకు ఆరోగ్యసూత్రాలు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, వరలక్ష్మి, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు ప్రసూన, కవిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోండి

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రష్మిత అన్నారు. ఏఎల్‌పురం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నడవలేని వారికి ఇంటి వద్ద వైద్య పరీక్షలను నిర్వహించి వారికి మందులను అందజేశారు. అనంతరం 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, కవిత, హైమావతి, స్వర్ణలత, రీటా తదితరులు పాల్గొన్నారు.



జి.గొల్లపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రష్మిత

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు





మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, మామిడి చెట్లలో కొమ్మ కత్తిరింపును తెలియజేస్తున్న అధికారులు

- మామిడి కొమ్మల కత్తిరింపు తప్పనిసరి
- జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళెం: మామిడి సాగులో పంట కోత అనంతరం చేపట్టే యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కరిడివారిపల్లెలో రైతు వేణుగోపాల్‌రెడ్డి మామిడి తోట ఆవరణలో శుక్రవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి పంట కోత అనంతరం యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రెడ్డిరామ్ మాట్లాడుతూ, మామిడి తోటల్లో పంట కోత తరువాత చెట్ల కొమ్మల కత్తిరింపు తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. తోటల్లో జనుము, జీలుగ, పిల్లపిసర లాంటి పచ్చిరొట్టను ఇచ్చే పంటలను పెంచి కలియ దున్నాలన్నారు. 10 సంవత్సరాల మామిడి చెట్టుకు సుమారు 100 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల యూరియా, 5 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను చెట్టు మొదలు నుంచి 4 అడుగుల దూరంలో 30–45 సెంటీ మీటర్ల గాడి తీసి వేయాలని సూచించారు. మామిడి తోటను వాలుకు అడ్డంగా రెండు సార్లు దున్నాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ, ఉద్యానశాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించి మామిడి పంటను లాభసాటిగా చేసుకోవాలన్నారు. ఉద్యానశాఖ అధికారి లక్ష్మీ ప్రసూన మాట్లాడుతూ, ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.